



"గోదా రెక్స్‌ప్రెస్సు గోదారేస్టేషన్లో ఆగుద్దాండీ?"

'ఆగ'దని అప్పుడే తెలుసుకుని రాజమండ్రి స్టేషనుకు వెళ్ళి పోదామని గోదావరి స్టేషన్లోంచి అప్పుడే బయటకు వస్తున్న విశ్వనాథాన్ని అడిగిందో అమ్మాయి.

"ఆగదు" అని తొందరగా వచ్చేస్తున్న వాడల్లా ఒక్క క్షణం ఆగిపోయాడు.

ఎందుకంటే, అతన్నా ప్రశ్న వేసిందో అందమైన అమ్మాయని, అందులోనూ ఒంటరిగా ఉందని గుర్తొచ్చి.

వెనక్కి తిరిగి చూశాడు.

అప్పటికే ఆ అమ్మాయి అతన్ని సమీపించి, "రాజమండ్రి స్టేషన్ వెళ్ళిపోతే బండి అందుద్దాండీ?" అని మళ్ళీ అతన్నే అడిగింది.

క్షణం క్రితం మెరిసిన మెరుపు, వెన్నెలంత వెలుగయి పోయే సరికి విశ్వనాథానికి చప్పున నోట మాట రాలేదు. శీతాకాలపు తెల్లారుజాము గాలి రివ్వున ఒళ్ళంతా సోకి మరింత కలవర పెట్టేసింది.

తన ఇరవయిఅయిదేళ్ళ కొద్ది జీవితంలో చాలామంది అమ్మాయిలను చూసినా, అంత అందమైన అమ్మాయిని చూడటం అదే మొదటిసారి అతనికి.

"అందుకుందా మనే నేనూ పరుగెడు తున్నావండీ" అనాడు ఆ తమకంలోంచి తేరుకుని.

"ఏయ్ రిక్షా!" ఆఅమ్మాయి ఆత్రంగాకేకేసింది.

'తనన్న మాట వినిపించుకుందో లేదో' అని విశ్వనాథం అనుకునే లోపల రిక్షాలో ఆ అమ్మాయి కూర్చోటం, వెంటనే రిక్షా బయలు దేరటం చూసేసరికి అతనికి మతే పోయినంత పనయింది.

మెరుపయి మెరిసి, వెన్నెల జాలయి కురిసి, శీతాకాలపు గాలయి కులికి, ఒక్క క్షణం గుండె మొత్తాన్ని కుదిపి, మరుక్షణం మాయమయి పోవడం మరో క్షణం సహించలేక పోయిన విశ్వనాథం దారంట పోతున్న రిక్షాలోకి ఎగిరి గంతేసి కూర్చుని బేరమన్నా ఆడకుండా "రాజమండ్రి స్టేషన్కి" అన్నాడు.

రిక్షాలో కూర్చున్న విశ్వనాథం ఆలోచన లన్నీ ముందు రిక్షాలో కూర్చున్న ఆ మెరుపు తీగ చుట్టూ అంతూ పొంతూలేకుండా తిరుగుతున్నాయి.

విదియ చంద్రుని వెన్నెట్లో వూరు వూరంతా నిశ్శబ్దంగా నిద్ర పోతూంటే, ఆ అందమయిన నిశ్శబ్దంలో గోదావరి మీంచి జివ్వుమని వీచే శీత గాలి ముందు రిక్షా వెనక తెరని అప్పటప్పట ఎగరే స్తున్నప్పుడు, ఆ అమ్మాయి పచ్చటి వీపు మీదా, ఒత్తయిన జడ మీదా, ఆ జడలోఅప్పుడే విచ్చు కుంటూన్న పన్న జాజుల మీదా, చిక్కటి వెన్నెల పడి మెరుస్తున్నప్పుడూ, ఆ మెరుపుని మోసుకొచ్చి శీత గాలి సరసరాన్నీ అల్లరి పెడుతున్నప్పుడూ విశ్వనాథం ఆలోచనలు మరింత విశ్వరూపం దాలు స్తున్నాయి. అతి సుందరమైన ఆ దృశ్యానికి మధుర మైన సంగీతం సమకూరుస్తున్న జంట రిక్షాల మువ్వల చప్పుడుకి విశ్వనాథం గుండె వింతగా స్పందిస్తూంది.

ఇద్దరి రిక్షాలూ ఇంచుమించు ఒకే సా రాగాయి రాజమండ్రి స్టేషను ముందు.

ఆ అమ్మాయి రిక్షా దిగుతూనే వెనక్కి తిరిగి వెనక రిక్షాలో వచ్చింది అతనేనా, కాదా? అన్నట్టు చూసింది అతని వే పోసారి.

'నేనే' అన్నట్టు చూశాడు విశ్వనాథం.

'నాకు తెలుసు నువ్వు నా వెంట వచ్చి తీరతా వని' అన్నట్లు తమాషాగా నవ్విం దా అమ్మాయి.

అంత ముగ్ధ మోహనంగా ఒక అందమైన అమ్మాయి అతని వేపు చూసి నవ్వటమనేది అతని జీవితంలో అదే మొదటిసారి.

ఆ అనుభవంలో తలమునక లయిపోతున్న విశ్వనాథానికి "పది రూపాయలకి చిల్ల రుంటే ఈ చలిలోరిక్షా ఎయ్యడ మెందుకండీ?" ఆఅమ్మాయిని తీసుకొచ్చిన రిక్షా వాడంటున్న మాటలకి తెలివొచ్చే సరికి, "అర్ధరూపాయినేదు బాబయ్యా" అసంకల్పంగా తనిచ్చిన మూడు రూపాయలూ అందుకున్న తన రిక్షా వాడి సణుగుడు వినిపించింది.

అవకాశం అలా రెక్కలు కట్టుకొచ్చి వాలుతుం దనుకోలేదు విశ్వనాథం.

వచ్చిన అవకాశాన్ని జార విడుచుకో లేదు.

"పరవాలేదు, నే నిస్తానుండండి" అన్నాడా అమ్మాయి దగ్గిర కెళ్ళి.

"ఎందుకండీ, వాడే మార్చుకొస్తాడు" అం దా అమ్మాయి.

ఆ అమ్మాయి మాటలు పట్టించుకోకుండా మరో రెండు రూపాయలు తన రిక్షా వాడి కిచ్చి "ఇద్దరూ పంచుకోండోయి" అన్నాడు కాస్త హుందాగా.

తెల్లారుజామున మొగుడి పక్కలో బద్ధకంగా పడుకున్న కొత్త పెళ్ళి కూతుర్లా ఉంది రాజమండ్రి స్టేషను బుకింగు దగ్గిర కెళ్ళి చూస్తే చాంతాడంత క్యూలో జనం టిక్కట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు.

"వచ్చాం" అనుకోబోయి ఆపేశాడు విశ్వనాథం



"ఈ సైడ్నుం చెళ్ళి నే తెస్తాలెండి" అం దా అమ్మాయి ఆడవాళ్ళ వేపు వెళుతూ.

ఆ మాటకి మురిసిపోయి ఇరవయి రూపాయల నోటు తీసిచ్చాడు విశ్వనాథం.

"మీరూ విశాఖపట్నమేనా?" అడిగిం దా అమ్మాయి.

"వూ" ఆ అమ్మాయికూడా విశాఖపట్నమే వస్తూందన్న సంతోషంలో అంతకంటే మాట రాక అన్నాడు విశ్వనాథం.

అయిదు నిమిషాల్లో అతని టిక్కట్టూ అందులో మిగిలిన చిల్లరా అతని చేతి కిచ్చింది.

"ఇందాకట్లా మీరు రిక్షావాడి కిచ్చిన రెండున్నరా ఇదుగో." అదనంగా రెండున్నరా ఇస్తూ అం దా అమ్మాయి.

"దాన్నే వుం దుంచండి" అంటున్నా వినిపించు కోకుండా బలవంతంగా చేతిలో పెట్టేసిన ఆ అమ్మాయిని చూస్తూ చాలా పొచ్చుకున్నాడు విశ్వనాథం.

ఆ ఋణానుబంధం అక్కడితో తెగిపోనివ్వ కుండా ఆమెతోపాటే ప్లాట్‌ఫారం మీదకు వెళ్ళ గానే రైలు మరో అరగంటక్కాని రాదంటూ అయిదు భాషల్లో అరిచి మొత్తుకుంటున్నాడు ఎనౌన్సరు.

విశ్వనాథానికి ఆకలేసింది.

ఆ అమ్మాయిని ... తనతోబాటు( ఒకే రిక్షాలో కాక పోయినా ) రిక్షాలో వచ్చిన అమ్మాయిని ... తనకు అంత రష్‌లో టిక్కట్టు తీసిచ్చిన అమ్మాయిని ... తన రెండున్నరా ఖచ్చితంగా తిరిగిచ్చేసిన అమ్మాయిని ... అంతకన్నా ఒంటరిగా ఉన్న అమ్మాయిని ... ఆ మెరుపు తీగని ... ఆ బంగారు బొమ్మని ... అట్లా నిర్దాక్షిణ్యంగా వదిలేసి తనొక్కడూ టిఫిన్ చెయ్యడానికి విశ్వనాథానికి ఎంచాతో మన సొప్పలేదు. మునుపెప్పుడూ ఇట్లా మనసొప్పడం ఎరగడు. ఇదంతా కొత్త కొత్తగా ఉంది! "టిఫిన్ చేద్దా మా" అనడానికి ముందు వెనకాడేడు కాసేపు. కాని, ఇలాంటప్పుడే మగాడన్న వాడికి కొంత పుష్ ఉండాలనుకుని ధైర్యం తెచ్చుకున్న మరో క్షణంలో "కాస్త టిఫిన్ చేసొద్దాం వస్తారా?" అని అడిగేశాడు.

అతనివేపు ఆ అమ్మాయి అదోలా చూసింది.

ఈమధ్యనే పుస్తె కట్టిన పెళ్ళాన్ని అడుగుతున్న కొత్త మొగుడిలా ఉన్నాడు విశ్వనాథం.

ఆ అమ్మాయిమాత్రం అప్పుడే పెళ్ళయిన పెళ్ళి కూతుర్లా లేదు. అలా సిగ్గు పడనూ లేదు.

"బండొచ్చేస్తుందేమో?" అంది చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ.

"ఇంకా ఎక్కడ బండండీ? గూడెం వదిలుంటుం దేమో, పర్వాలేదు రండి." కేంటీన్ వేపు దారితీస్తూ అన్నాడు.

మౌనంగా అనుసరించిం దత న్నా అమ్మాయి.

"రెండిడ్లీ, వడా, పూరీ" రెండు ప్లేట్లు ఆర్డ రిచ్చేడు.

ఆ పిల్ల ఒద్దు, ఒద్దంటున్నా వినిపించుకోనంత ఆవేశంలో ఉన్నాడు విశ్వనాథం.

కాఫీలు తీసుకుని, అన్నిటికీ డబ్బులు విశ్వనాథమే ఇచ్చేసేడు.

తన వాటా ఆ అమ్మాయి ఇవ్వబోతుంది ...

"ఇంతలో మీరు నాకేం ఋణపడిపోరుగానీ, ఉంచం డుంచండి" అన్నాడు.

ప్లాట్‌ఫారం మీద నిల్చున్న ఆ మెరుపు తీగె వంక ఆబగానూ, పక్కనున్నంచున్న విశ్వనాథం వంక అసూయగానూ ప్లాట్‌ఫారం మీద తిరుగాడే ప్రతి మగ చూపుల్నీ చూస్తున్న విశ్వనాథం చాతీ గర్వంతో మరీ బోర విరుచుకుంటోంది. ఆ దర్పంతో సిగరెట్టున్నూ వెలిగించాడు.

అంతట్లో ట్రైనొచ్చేసింది.

అసలే క్రిక్కిరిసొచ్చిన ట్రైను మీదికి ప్లాట్‌ఫారం మీదున్న జనం లంఘించే సరికి, రైల్లోకెళ్ళే మార్గం తోచక ఆ అమ్మాయి కంగారుపడిపోవడం గమనించాడు విశ్వనాథం.

"మీ రిక్కడే ఉండండి" అని తన బేగ్ ఆమె చేతి కిచ్చి దూసుకుపోయాడు జనంలోకి.

విశ్వనాథానికి స్వతహాగా కొన్ని తెలివితేటలున్నాయి. అవి ఇప్పుడు మరీ పదునుతేలి ఉన్నాయి!

టూ టైర్ కంపార్టుమెంటు దగ్గరకెళ్ళి అప్పుడే దిగిన కండక్టర్ని పట్టేసి,ఏం మాట్లాడాడో ఏమో మరి, ఇద్దరూ కలిసి కేంటీన్‌లో కెళ్ళారు.

చిర్నవ్వుతో ఆ అమ్మాయి దగ్గరకు తిరిగొచ్చాడు.

"సీట్లు సంపాదించే సరికి తల ప్రాణం తోక కొచ్చింది" అన్నాడు విశ్వనాథం.

ఆ అమ్మాయి అతన్నదోలా చూసింది.

అదోలా ఆ అమ్మాయి చూసినప్పుడల్లా విశ్వనాథం మరోలా అయిపోతున్నాడు.

"పదండి, పదండి" అన్నాడు ఆ అమ్మాయిచేతి లోంచి తన బేగ్ పుచ్చుకుంటూ.

కంపార్టుమెంటులోకి ఆ మెరుపు తీగ అడుగు పెట్టేసరికి, నిద్రకళ్ళతో జోగుతున్న మగాళ్ళందరికీ చప్పున తెలి వొచ్చేసి, మత్తూగిత్తూ వదిలిపోయింది.

కలిసొచ్చినట్టు, కిటికీ దగ్గిర ఎదురు బొదురు సీట్లొచ్చాయి.

విశ్వనాథం కులాసాగా ఒక సిగరెట్టు ముట్టించాడు.

బండి నత్త నడకలతో బయలుదేరి, కాస్సేపట్లో పరు గందుకుంది.

చల్లటి గాలి రివ్వున వచ్చి మొహాన్ని తాకుతోంది.

ఎదురుగా ఉన్న చందమామ వెన్నెల ఒలకపోస్తోంది.

వెన్నెట్లో తడుస్తూ రైల్తోపాటు పరుగిడుతున్న ప్రకృతి ముగ్ధ మనోహరంగా ఉంది.

కిటికీ అంచుమీద తల ఆన్చి అందమైన ఆ ప్రకృతిలోకి చూస్తూ ఉం దా అమ్మాయి.

ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోయాడు విశ్వనాథం.

"మీ పేరేం టన్నారూ?" అడిగాడు.

"నేనే మన్నేదే!" చిలిపిగా నవ్వుతూ అం దా అమ్మాయి.

"అన్లేదా? పోనీ ఇప్పుడు చెప్పండి."

"మంజుల."

"చాలా అందమైన పేరు" అనలేదు. అనుకున్నాడు విశ్వనాథం.

"నా పేరు విశ్వనాథం—స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్నాను" తనని పరిచయం చేసుకున్నాడు.

# ప్రకృతి ధర్మం

మాడిన ముఖాలపై
బూడిద రంగులోంచి మొలిచే
ఆ స్వచ్ఛమైన నవ్వుల వెనక
సిమెంటు మేడల గట్టిదనం!
రోడ్డువార తవ్వే ఆ చేతుల్లో
గడపారల కరకుదనం.
ఎండలో దుమ్ములో పక్కనే
పెరుగుతున్న మానవ రూపాలు
బాల్యంలోంచి సరాసరిన
వృద్ధాప్యంలోకే అడుగుపెట్టే ఆకారాలు
యౌవనం ఆనందం అన్నీ
అంగట్లో అంగలారుస్తూ
ఇతరుల సౌఖ్యాల చెట్లకు నీరై
నేలమటం కావడం
తరతరాల సంప్రదాయం
మండే పువ్వులుగా పెరగడం
ఈనాటి ప్రకృతి ధర్మం.

\- నిఖిల్

---

"విశాఖపట్నంలోనా?" అడిగిం దా అమ్మాయి.

"కాదండీ హైదరాబాద్‌లో. మా చిన్నాన్నగారబ్బాయి పెళ్ళికి వొచ్చాను రాజమండ్రి. విశాఖపట్నంలో రాంగోపాలమని ఒక బెస్ట్ ఫ్రెండోకాయనున్నాడు. ఎలానూ ఇంతదూరం వచ్చానుగదా, ఒకసారాయన్ని చూసి పోదా మని వెళ్తున్నాను. మీది విశాఖపట్నమేనా?" పూర్వాపరాలు చేస్తూ అడిగాడు విశ్వనాథం.

"ఏడాదినుంచి ఉంటున్నాను కాబట్టి ప్రస్తుతానికి విశాఖపట్నమనే చెప్పొచ్చు" అందామె ఎటో చూస్తూ.

"ఉంటున్నా నంటున్నారూ, మీ రొక్కరేనా ఉండేదీ?"

ఆమె చురుగ్గా చూసిం దతన్ని. ఆ చూపుకి కలవరపడ్డాడు విశ్వనాథం.

"నా ఉద్దేశం ..." అంటూ మొదలెట్టబోయిన అతన్ని అడ్డి—"నా కర్థమయింది లెండి...ఒంటరిగా ఉంచటమే? పదిమందిలోనూ ఉంటున్నాను. కాపోతే ..." అని సగమే చెప్పిం దామె.

మరీ అర్థమయి చావలేదు విశ్వనాథానికి!

"కాపోతే ...?" వదిలేకూడ దనుకున్నాడు.

"ఒక చోటస్థిరంగా ఉండేది లేదు" అం దా మెరుపు తీగ జడ ముందుకేసుకుని అల్లుకుంటూ.

అలా ఒత్తయిన జడ మెడమీంచి నున్నటి భుజాల మీదుగా జారి, అక్కడెక్కడో ఎత్తయిన ఒక కొండ మీంచి కాటుక జలపాతపు ధారలా విశాలమైన ఆమె ఒడిలోకి ఉరికి పడ్డప్పుడు, శ్రావణ మేఘానికి వెండి అంచు పొదిగినట్టు, సన్నజాజుల రెక్కలు ఆ జడ నంటుకుని, అత్యద్భుతంగా ఆమె అందం కొన్నివేల రెట్లు ఒక్క క్షణంలో పెరిగిపోయే టప్పటి విశ్వనాథం ఒంట్లో నరాలు తట్టుకోలేకపోయాయి.

ఆ తాకిడి నుంచి తేరుకోడానికి విశ్వనాథానికి రెణ్ణిముషాలు పట్టింది.

"మీరు చేస్తున్న జాబ్ అలాంటిదేం?" తేరుకున్నాక అడిగాడు.

"నేను ఉద్యోగం చేస్తున్నానని మీ కెవరు చెప్పారేం?" ఎదురడిగిం దామె.

"తరుచూ వూళ్ళు మారుతూ ఉంటా రంటుం టేనూ!"

"అదంతే లెండి." ఆ విషయాన్నింక పొడిగించ దలచుకోలేదు.

"ఇంత చిన్న వయసులో మీరు ఉద్యోగం చెయ్యడమే ఆశ్చర్యం వేస్తోంది. పైగా ఏడాదికీ, ఏణ్ణర్థంకీ వూళ్ళు మారే ఉద్యోగ మొటి. ఏం ఉద్యోగ మండీ బాబూ అది?" ఎదురుగా ఉన్న బంగారు బొమ్మ ఉద్యోగం చేస్తోందన్న విషయం భాయ పెట్టేసుకుని అన్నాడు విశ్వనాథం.

"చిన్న వయస్సంటున్నారు ... నా వయసెంతో మీకు మహా తెలుసున్నట్టు మాట్లాడుతున్నారే?" అంది ఆ అమ్మాయి ఫక్కున నవ్వి.

అలా నవ్వినప్పుడు దొరికిన ముత్యాలన్నీ ఏరి గుండె నిండా పట్టుకున్నాడు విశ్వనాథం.

"మనిషిని బట్టి వయసు తేల్చడం పెద్ద కష మా?" అన్నాడు.

"అహా! అయితే నా వయ సెంతుంటుందో చెప్పండి చూద్దాం?"

"మహా ఉంటే ఇరవయ్యుండొచ్చేమో."

మెరుపుతీగ గుండెలో నవ్వుకుంది. అయితే దాని ఛాయ ఒకటి ఆమె కళ్ళలో కి పాకింది.

"నే చెప్పింది కరక్టే నంటారా?" అనుమానంగా అడిగాడు.

"మీ కింకా పెళ్ళయినట్టు లేదులా ఉంది" అందామె నవ్వుతూ.

"మీ కెలా పోల్చేసేరూ?' ఆశ్చర్యంగా అడిగాడు.

"పెళ్ళికాని అబ్బాయిలకి కనబడ్డ అమ్మాయిలంతా తమకంటే తక్కువ వయస్సు వాళ్ళలాగే కనపడతారనీ" అం దామె నవ్వుతూనే.

"అయితే నే చెప్పింది తప్పంటారా?"

"నేనేమీ అన్లేదే."

మెరుపు తీగ వయసు ఇరవయి లోపో, పైనో విశ్వనాథానికి తేలింది కాదు!

"అద్సరే, ఇంతకీ ఎందులో ఉద్యోగం చేస్తున్నారో చెప్పారు కాదు మొత్తానికి" అన్నాడు.

"చెప్పప్పోడం వల్ల మీకేం నష్టం లేదుగా?" నవ్వాపేసి అడిగిం దామె.

విశ్వనాథం తడబడ్డాడు.

"అబ్బే, వూరికే అడిగేను. ఇష్టంలేకపోతే చెప్పొద్దు లెండి." దెబ్బ తిన్నట్టుగా అన్నాడు.

ఆ అమ్మాయి మరేం మాట్లాడలేదు.

తెల్లగా తెల్లారిపోవడంతో కంపార్టుమెంటులో

సంతకడి పెప్పుంది.

లేలేత ఎండ వచ్చుటి ఆమె మొహం మీద పడి నప్పుడు ఆ రోజు సూర్యోదయం ఆకాశంలో కాకుండా, బంగారబ్బొమ్మ విశాలమైన నుదుటి మీద మెరిసిపోయే గుండ్రమైన ఎర్రటి బొట్టు లోంచి అయిందనుకున్నాడు విశ్వనాథం.

“విశాపట్నంలో మీ రెక్కడా ఉండేది?” చాలా సేపయి, ఇద్దరి మధ్యా పేరుకున్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగాడు విశ్వనాథం.

అడిగిన తీరు కాకతాళీయంగానే ఉన్నా, కావాలనే అడిగినట్లు నిపించింది మెరుపు తీగకి.

“ఏం, వీలు చూసుకు వస్తారా?” నవ్వుతూనే అంది.

విశ్వనాథం మళ్ళీ కంగు తిన్నాడు.

“మీరు విశాఖపట్నం తరచూ వస్తుంటారా?”

విశ్వనాథం ఏం మాట్లాడక పోవడం చూసి, ఆ అమ్మాయే మొదలెట్టింది.

“అబ్బే, ఇదిమూడో సారి రావటం. హైదరాబాదు నుంచి రావటమంటే మాట లేంటండీ. ఏదో అకేషనల్‌గా ఇలా వచ్చినప్పుడల్లా. . . అదీ చెప్పానుగా, నా ఫ్రెండున్నా డన్నీ” అన్నాడు విశ్వనాథం మళ్ళీ మామూలు మనిషయి.

“అవునూ, మీ ఫ్రెండు పేరు ఎక్కడో విన్నట్టుంది, తరుచూ చూసినట్టూ గుర్తు లేదు కానీ, పరిచయమున్న పేరులా అనిపిస్తోంది” అంది మెరుపు తీగ.

“కరెక్ట్. తరచూ పత్రికల్లో చూస్తూ ఉంటారు అతనో పేరు మోసిన రచయిత. చూడండీ పత్రికలో అతనిదో కథ పడింది” అంటూ బాగ్ లోంచి ఒక పుస్తకం తీసిచ్చాడు విశ్వనాథం.

“ఒక వేళ తీరా మీరు వెళ్ళేసరికి ఆయన వూళ్ళో ఉండరనుకోండి. అప్పు డేం చేస్తారు?” సడన్‌గా అడిగింది మెరుపు తీగ, అలవోకగా చూస్తూ పుస్తకంలోంచి తలెత్తి.

ఆ అడగడంలో నిగూఢమైన అంతరార్థం ఏదో ఉన్నట్టు స్పష్టంగా ధ్వనిస్తోంది కానీ, అంత సడన్‌గానూ, టక్కున చెప్పటానికి సమాధానమైతే తోచింది కానీ, చెప్పడానికే ధైర్యం చాల్లేదు విశ్వనాథానికి.

“తిరుగు బండెక్కేటమే” మనసు లోంచిగాక నోటిలోం చొచ్చిన మాటలా ఉం దత నన్నది.

“ఆయన తప్పించి మరెవర్నీ తెలీదా మీకూ?” అడిగిం దామె పుస్తకం చూస్తూనే.

“ఈ తెల్లారుజాం దాకా తెలీదు.” ఇంతసేపటికి మెరుపు తీగ నో దెబ్బ తీశా నన్నట్టు నవ్వి అన్నాడు విశ్వనాథం.

మెరుపు తీగ చప్పున పుస్తకాన్ని మొహానికి అడ్డం పెట్టుకుంది.

పుస్తకాని కవతల ఆమె మొహంలో పడ్డ సిగ్గు దొంతర లన్నీ విశ్వనాథం వూహాల్లో దండ గుచ్చు కున్నాయి.

అయితే ఆ తరవాత మెరుపు తీగ పుస్తకం అడ్డు తొలగించకుండా అందులో మునిగి పోయింది.

‘నేరప్పోయిచ్చానా బాబూ పుస్తకం’ అని తనని తనెన్ని సార్లు తిట్టుకున్నాడో విశ్వనాథానికి లెక్క తేలలేదు.

ఆ పుస్తకం అడ్డు అనకాపల్లొచ్చిందాకా తొలగలేదు విశ్వనాథానికి.

“చాలా బాగా రాశారండీ ఈ కథ మీ ఫ్రెండూ” అంది మెరుపు తీగ పుస్తకం మూస్తూ.

తనకీ, బంగారబ్బొమ్మకీ అడ్డం వచ్చిన రాంగోపా లాన్ని కసి తీరా తిట్టుకున్నాడు విశ్వనాథం.

అనకాపల్లి వదిలింది రైలు.

“వచ్చేదే కదూ విశాఖపట్నమూ?” తెలిసుండీ అడిగాడు మెరుపుతీగని కదపాలని.

“పూఁ. . . ఇంతకీ ఆయనా... అదే మీ ఫ్రెండు లేకపోతే, మీ ప్రోగ్రా మేంటో తేల్చారు కాదు” అంది మెరుపు తీగ విశ్వనాథం కళ్ళల్లోకి చూస్తూ.

“మీ రన్ని సార్లంటూంటే నిజంగా ఉండ దేమోననిపిస్తోంది. అసలే కాల్లో చక్రం ఉన్న మనిషతనూ. ఆసేతుహిమాచలమూ అతని కాపు లేనూ. మూడ్రోజులు సెల వొస్తే, వాళ్ళావిడకి మొగుడూ, ఆ పిల్లలకి తండ్రీ కాడతను” అన్నాడు రాంగోపాలం ధోరణిలో. వింది గానీ, ఏం మాట్లాడే దామె.

“అత న్లేకపోతే ఏం చెయ్యడమా” న్న బెంగ పట్టుకుంది. మూడు రోజులు సెలవు పొడిగించీ శాను ఆదివారం కలిసొస్తోంది కదాని” అన్నా డతను ఆమె వేపు ఆశగా చూస్తూ.

మళ్ళీ ఆమె ఏం అనలేదు.

రైలు విశాఖపట్నం పొలిమేరల్లో, ఆనవాయితీ ప్రకారం ఆగి, ఆలసట తీర్చుకుంటూంది.

కొద్ది క్షణాల్లో మెరుపు తీగని విడిచి పెట్టే యాల్సొస్తోంది అన్న వూహ మెదిలే టప్పటికి మనసు కొట్టుకు పోయింది విశ్వనాథానికి.

ఆమెతో మాట్లాడ వలసిన మాటలు ఇంకా కొన్ని లక్షల వరకు మిగిలి పోయినట్ల[illegible]కాని, ఒక్కమాటకీ పూర్తి స్వరూపం కనిపించ లేదతనికి.

“ఏమయినా, ఈ ప్రయాణాన్నీ, ఈ ప్రయాణంలో పరిచయ మయిన మిమ్మల్నీ, అతి మధురమయిన ఈ కొద్ది గంటల్నీ, నా జీవితంలో మరిచిపోలేను మంజులగారూ’ మిగిలిన లక్ష మాటల్లోనూ అక్షరా లన్నీ ఏర్చి కూర్చి ఈ వాక్య నిర్మాణం కావించటానికి విశ్వనాథం పడ్డ అవస్థలు అంతా ఇంతా కాదు. తీరా అన్నాక, తన మాట తనకే చప్పగా వినిపించింది.

“అ అ, ఎన్నాళ్ళు జ్ఞాపకం ఉంటుంది లెండి” అందామె.

“మీకేమిటా కానీ. నా గుండెలు పట్టిన అతి కొ[illegible] మధురమైన జ్ఞాపకా లన్నిటికీ మీద అత్యంత మనోహరమైన ఈ జ్ఞాపకం పెద్ద పీట వేసు క్కూర్చుంటుంది”. ‘ఆగి పోవడ మంటూ సంభవిస్తే ఈ జ్ఞాపకమూ, నా వూపిరీ ఒకేసారి ఆగిపోవాలి’ అనికూడా అందామనుకున్నాడు [illegible] అనలేదు కానీ, అన్నది చాలా గొప్పగా అన్నా ననుకున్నాడు.

“ఈ ముక్క మీ ఫ్రెండుకిచెప్పండి ఏ కథలోనా వాడుకుంటారు” అంది మెరుపు తీగ వెన్నెల్లా నవ్వి.

రైలు కదిలింది.

తెల్లారి బారెడు పొద్దెక్కినా కంపార్టుమెంటులో ఇంకా నిద్ర పోతున్న ప్రయాణీకులు కంగారుగా లేచి, కళ్ళ కెదురుగా మెరిసి పోతున్న మెరుపుతీగని కళ్ళప్పగించి చూస్తూ ఉండి పోయారు, ఇక్కడితో తాము దిగి పోవాలన్న సంగతి మరిచిపోయి.

రైలు ప్లాట్ ఫారమ్ సమీపిస్తోందనగా, “ఇంతకీ విశాఖపట్నంలో మీ రెక్క డుండేదీ చెప్పారే కాదు” అని గుండె చివర్న వూగిస లాడే ఆ ఒక్క ముక్కా బయట కనేసేడు విశ్వనాథం.

“కలుస్తారా ఏం?” అంది మెరుపు తీగ ఫక్కున నవ్వి.

“అవకాశం ఉంటే అదో వరంలా భావిస్తాను” అన్నాడు, అప్పుడే ప్రత్యక్షమైన దేవుడి ముందు వరం అడిగే భక్తుడిలా.

“అల్లిపురం గాంధీ బొమ్మ దగ్గిర జోగారావు కంపెనీ కంటే తీసుకెళ్ళని రిక్షా లేదు విశాఖ పట్నంలో” అంది మెరుపుతీగ రైలు దిగ ముందు.

“వెళ్ళే లోపు వీలుంటే మీ కంపెనీ కొచ్చి మిమ్మల్ని కలుస్తా న్లెండి.” ప్లాట్ ఫారమ్ దాటి బయటి కొస్తూ అన్నాడు విశ్వనాథం, ‘ఇంటి ఎడ్రసు తెలుసుకో’ అని గుండె ఒక మూల సతాయి స్తోంటే.

“వీలు చేసుకుని కలవండి” అంది మెరుపు తీగ రిక్షా ఎక్కుతూ.

ఆ ఒక్క ముక్కకి పరమానంద భరితుడయి పోయాడు విశ్వనాథం.

‘ఇంటి ఎడ్ర సడగడం మరిచిపోయానుస్మీ’ అన్నాడు నాలి క్కరుచుకుంటూ సతాయిస్తున్న గుండెతో, మెరుపు తీగని లాక్కెళ్ళి పోతున్న రిక్షాని దిగాలుగా చూస్తూ.

---

## నేత

మా కాక నేతను
ప్రసాదించు ప్రభూ!

కుల మత భేదము లెంచని నేత
జాతి గౌరవము పెంచే నేత
అక్రమాలు నిరసించే నేత
అన్నిట అందరి మన్ననలందే
నేత

మానవజాతి మనుగడ పెంచే
మా మనుగడకు తీరులు దిద్దే
మహోజ్జ్వల భవిష్యతుకు
బాటలు వేసే
మహా మహుడగు మహానేతను...

-కోకా రాఘవరావు

నచ్చి రెండు రోజు లయినా ఒక్క క్షణం విశ్వనాథాన్ని ఒంటరిగా విడిచి పెట్టిందిలేదు రాంగోపాలం.

మెరుపు తీగని కలుసుకోవాలన్న తపన క్షణక్షణానికీ ఎక్కువయిపోతూంది విశ్వనాథానికి.

'అల్లిపురంలో తెలిసున్న చుట్టా లెవరో ఉన్నారు. వాళ్ళ నో సారి చూసి రావాలి గురువుగారూ' అన్న ముక్క అక్కడికీ తెగించి పది సార్లన్నా అన్నా డా పూట.

"తెలుగువాడికి చుట్టాల కొదవేంటి. ఉంటూనే ఉంటారు. నువ్వొచ్చినట్టు వాళ్ళకిగాదావేం? చూడొచ్చు లేదూ" అని కొట్టి పారేశాడు బెస్టు ఫ్రెండు.

"కోరమాండల్ ఫెర్టిలైజర్స్" చూసి నాలుగ్గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగొచ్చే సరికి, "ఈ రాత్రి మీ ఫ్రెండుకి మీ చేతి వంట రుచ్చూపించండి" అని రాంగోపాలంగారి సతీమణి బయట కూర్చుని అంది నవ్వుతూ.

"హతోస్మి! నాయనా విస్వనాథవ్వూణ్ణవాళ్టికి మరింతే సంగతులు. ఎంచక్కా ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వంట చేసుకోవాల్సిందే" అన్నాడు రాంగోపాలం లుంగీ చుట్టుకుంటూ. విశ్వనాథం రొట్టె విరిగి నేతిలో పడింది.

ఈ ఛాన్స్ ఎంత మాత్రం వదలదలుచుకో లేదు.

"అయితే గురువుగారూ, నే నలా నో సారల్లిపుర మెళ్ళొచ్చేస్తానో గంటలో" అన్నాడు చెప్పు లేసుకుంటూ.

"వచ్చిన దగ్గిర నుంచీ అల్లిపురమేనని చంపేస్తున్నావు. అంత ఇంట్రెస్టింగు చుట్టా లెంటోయి వాళ్ళు? పెళ్ళి కావలిసిన కుర్రాడివి. సంబంధాలు చూపించీ గ్రలు జాగర్త సుమా" అన్నాడు నవ్వుతూ రాంగోపాలం. మరేం వినిపించుకో లేదు విశ్వనాథం.

"వెళ్ళొస్తానండి" అని బయలుదేరేడు.

"భోజనానికి మాత్రం వచ్చే నాయనా."

రాంగోపాలం అరిచిన అరుపు వినపడేటప్పటికి రిక్షా ఎక్కేశాడు విశ్వనాథం.

అయి దయిపోతూంది టైమ్. కంపెనీ విడిచి పెట్టేస్తారేమో నన్న ఆత్రత అతనికి. మళ్ళీ అంతట్లోనే 'విడిచి పెట్టేస్తేనే మంచి'దనుకున్నాడు. కంపెనీలో విడ్రసడిగి ఇంటికి వెళ్ళచ్చన్న ఉద్దేశంతో.

'సంబంధాలు చూపించీ గ్రలు' అన్న రాంగోపాలం ముక్కే మనసు నిండా తిరుగాడుతూం దతనికి.

'చూసేది మెప్పుడో అయిపోయింది. ఇప్పుడు నిశ్చయించేసు కోడమే' అనుకున్నాడు విశ్వనాథం.

'మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చితే చెప్పండి—మాట్లాడ్డానికి మా వాళ్ళని పంపిస్తాను రెండు రోజుల్లో' అని మాటిగా అడిగే దలుచుకున్నాడు కూడాను.

'బేజారిపోతే అలాంటి బంగారబ్బొమ్మ దొరకద్దూ' అని అనుకున్నాడు.

"ఇదే బాబూ జోగారావు కంపెనీ" అన్నాడు రిక్షా వా డో ఇంటి ముం దాపి.

ఒక సాదా మెడ ఇల్లది.

పైన ఒక బోర్డ్ గ్రట్రా లేదు.

[illegible] బాగా చీకటి కమ్ముకుం దప్పటికే.

అనుమానంగా చూస్తున్న పిలుద్ద విశ్వనాథానికి "లోపలి కెళ్ళండి బాబూ వర్షేలా. ఆయు గొప్పిం దాకా ఉండమంటారా?" అరిక్షావా డన్న మాటలు వినిపించింది.

"ఉం డొచ్చేస్తాను" అన్నాడు విశ్వనాథ మెందుకన్నా మంచిదని.

అక్కడికి తెగించి, ఆ ఇంటి గుమ్మ మెక్కేడు ఏమయితే అయిందని.

"రం డిలా—ఈ గదిలోకొచ్చి కూర్చోండి సార్" అన్నా డో గళ్ళ లుంగీ ఆసామీ ఎదురొచ్చి.

అత నన్పాపించిన గదిలో కొచ్చి సోఫా మీద కూర్చున్నాడు విశ్వనాథం.

మరో అయిదు నిమిషాలక్కానీ గళ్ళలుంగీ ఆసామీ కనిపించలేదు.

"ఒక్క అయిదు నిమిషాలు కూర్చోండి సార్" అన్నాడు గళ్ళలుంగీ వాడు.

'ఏమేందు కొచ్చాడో, ఎవరికోసం వచ్చాడో తెలిసినట్టే మాట్లాడుతున్నాడే' అనుకున్న విశ్వనాథం ఆశ్చర్యపోయాడు.

"ఒక వేళ తను రావడం ఏ కిటికీలోంచేనా చూసి మంజులే కబురెట్టిందా?" అన్న ప్రశ్న కూడా వేసుకున్నాడు.

దేనికీ సమాధానంలా మాత్రం లేదు గళ్ళలుంగీ ఆసామీ.

"ఇక్కడ మంజులనీ..." అడుగబోతున్న విశ్వనాథా న్నాపేసి —

"చెప్పరేం సార్ మరి—" అంటూ లోపల కెళ్ళి తిరిగొచ్చాడు గళ్ళ లుంగీఆసామీ వెనకాలో పిల్ల ఉంది.

పిల్లలాగే ఉంది గానీ కోతిలా ఉంది.

"ఈ అమ్మాయి కాదు" అన్నాడు విశ్వనాథం.

"సరుండండ్సార్" అని లోపలి కెళ్ళి తిరిగొచ్చిన గళ్ళ లుంగీ వాడి వెనకాల మరో అమ్మా యొచ్చింది ఇందాకట్లా వచ్చిన పిల్లకి తల్లిలా ఉందామె.

"ఈ అమ్మాయీ కాదు" అన్నాడు విశ్వనాథం కంగారుపడిపోయి.

"ఏ గా కే మంజుల కావాలన్నార్? కాకినాడ మంజులా, తెనాలి మంజులా, బెజవాడ మంజులా? ఉండండి అందర్నీ తీసుకొస్తాను, చూసుకుందురు" అని అంటూ గా లోపల కో కేకపెట్టేడు.

ఏమని కేక పెట్టాడో, శబ్దం తప్ప మాట వినిపించలేదు విశ్వనాథానికి.

ఆ శబ్దం లోపలి కెళ్ళిన మరు క్షణంలోపల్నుంచొచ్చిం దో అమ్మాయి పుట్ట.

అంతమందిలో అల్లదుగో ఆమె!

ఎంతమందిలో నయినా మెరిసిపోయే మెరుపు తీగ!

విశ్వనాథాన్ని చూసి ఒక్క ఎన్నెల రవ్వ విసిరి నట్టు నవ్విం దామె!

గళ్ళ లుంగీ వాడు కనిపెట్టేశాడు.

"పాలకొల్లు పాప అన్నేపితే తీసుకొచ్చేవాడిని కద్సార్. ఎల్లుండే వెళ్ళరంటా" అన్నాడు.

మెరుపు తీగ ఒక్కర్తే మిగిలిపోయింది.

"చెప్పండి సార్, ఇక్కడే ఉంటారా? ఎక్కడికన్నా తీసుకెళ్తారా?" అన్నాడు గళ్ళలుంగీ వాడు.

విశ్వనాథానికి మొత్తం అర్థమయి పోయేసరికి ముచ్చెమటలు పోసేసేయి!

గుండెలో ఒణుకు పుట్టేసింది!

ఒళ్ళంతా కంగారు మయమయి పోయింది!

చటుక్కున లేచి ఇవతలి కొచ్చేసి గుమ్మంలో ఉన్న రిక్షా ఎక్కేసేడు.

"దీప మెట్టగానే మా గొప్ప బేర మొచ్చింది రియాల" విసుక్కుంటున్న గళ్ళలుంగీ వాడి మాటలూ, కిసుక్కున నో నవ్వూ వినిపించాయి విశ్వనాథానికి.

నవ్వింది బంగారుబ్బొమ్మనీ, అందులోంచి వెన్నెల్లు కురిసుంటాయనీ అనిపించలేదు. ఎందుకంటే, ఆ నవ్వు ఒక్కసారి మెరిసి మాయమయిపోయే మెరుపు తీగలాంటిది అనుకున్నా డతను రిక్షాలో హాయిగా ఊపిరి పీల్చుకుని!

✱

